రాష్ట్ర స్థాయికి ఎంపికైన క్రీడాకారిణులు

ఖోఖో పోటీల్లో రాష్ట్ర స్థాయికి ఎంపిక

కల్హేర్, సెప్టెంబర్ 10: ఉమ్మడి జిల్లా స్థాయిలో నిర్వహించిన ఖోఖో పోటీల్లో కృష్ణాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన నలుగురు విద్యార్థినులు రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు కమ్మరి సుధాకర్ తెలిపారు. తూప్రాన్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి ఖోఖో పోటీల్లో ఉత్తమ క్రీడాస్ఫూర్తిని కనబర్చిన సోనా, వర్ష, శివాత్మిక, హారిక రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు పేర్కొన్నారు. ఈ నెల 13, 14, 15 తేదీల్లో ఖమ్మం జిల్లాలోని కల్లూర్ మినీ స్టేడియంలో జరగబోయే రాష్ట్ర స్థాయి పోటీలో పాల్గొని జాతీయ స్థాయికి ఎంపిక కావాలని ఆకాంక్షించారు. పీడీ రాములును సిబ్బంది, తల్లిదండ్రులు అభినందించారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడు మృతి

సంగారెడ్డి, సెప్టెంబర్ 10: అనుమానాస్పదంగా యువకుడు మృతి చెందిన ఘటన పోతిరెడ్డిపల్లి శిల్పా వెంచర్‌లో చోటుచేసుకుంది. మంగళవారం రూరల్ పోలీసులు వివరాలను వెల్లడించారు. పట్టణంలోని పోతిరెడ్డిపల్లి చౌరస్తాలో నివాసం ఉండే రాజస్తాన్‌కు చెందిన ప్రకాశ్(28) వినాయక విగ్రహాలను తయారు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. తన పని ముగించుకొని బయటికి వెళ్తున్నాని చెప్పి ఇంటి నుంచి వెళ్లాడు. ఎంతకూ రాకపోవడంతో అతడి భార్య చంపాభాయ్ రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈమేరకు పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ప్రకాశ్ మృత దేహం స్థానిక శిల్పా వెంచర్ ఎదుట నీటి కాల్వలో కనిపించిందని పోలీసులు గుర్తించారు. మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం జిల్లా కేంద్ర దవాఖానకు తరలించి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ వినయ్‌కుమార్ తెలిపారు.

బావిలో పడి మరొకరు..

కోహీర్, సెప్టెంబర్ 10: మొగుడంపల్లి మండలంలోని ఖాన్‌జమాల్‌పూర్ గ్రామానికి చెందిన గొల్ల విఠల్(41) మంగళవారం బావిలో పడి మృతి చెందాడు. చిరాగ్‌పల్లి ఎస్సై రాజేందర్‌రెడ్డి కథనం ప్రకారం.. ఖాన్‌జమాన్‌పూర్ గ్రామానికి చెందిన విఠల్ తన భార్య ఆరేండ్ల క్రితం చనిపోవడంతో తాగుడుకు బానిసయ్యాడు. దీంతో తీవ్ర మనస్తాపం చెందిన అతడు గ్రామ సమీపంలోని బావిలో పడ్డాడు. విషయం తెలిసిన స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జహీరాబాద్ దవాఖానకు తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

యువకుడి మిస్సింగ్

జయరాజ్

అమీన్‌పూర్, సెప్టెంబర్ 10: మేస్త్రి పనికని ఇంటి నుంచి వెళ్లిన యువకుడు అదృశ్యమైన ఘటన అమీన్‌పూర్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్సై సోమేశ్వరి కథనం ప్రకారం.. మున్సిపల్ పరిధిలోని బీరంగూడ ఉసికే బావికి చెందిన అడ్డాల జయరాజ్(25) మేస్త్రి పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ నెల 8న తాపీ పనికి వెళ్తున్నానని చెప్పి ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. ఎంత వెతికినా సమాచారం దొరకకపోవడంతో అతడి భార్య లలిత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ముబారక్‌పూర్‌లో మరొకరు..

సిర్గాపూర్, సెప్టెంబర్ 10: మండలం పరిధిలోని చిన్న ముబారక్‌పూర్ గ్రామంలో వ్యక్తి మిస్సింగ్ కేసు నమోదైందని ఎస్ఐ వెంకట్‌రెడ్డి తెలిపారు. గ్రామానికి చెందిన ఎర్రోళ్ల రాజు(38) ఆదివారం అర్ధరాత్రి ఇంట్లో నుంచి బయటకు వెళ్లాడు. ఇతడికి కల్లు తాగే అలవాటు ఉండగా వారం నుంచి మానేశాడు. ఎంత వెతికినా ఆచూకీ దొరకలేదు. ఇంటి నుంచి వెళ్లినప్పుడు తెల్ల చొక్క, నల్ల ప్యాంటు ధరించి ఉన్నాడని భార్య రుక్మిణి ఠాణాలో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

మద్యం విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు

రామచంద్రాపురం, సెప్టెంబర్ 10: అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ఓ వ్యక్తిని కొల్లూర్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఎస్సై సురేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని ఇంద్రానగర్‌కు చెందిన కృష్ణప్రసాద్ తెల్లాపూర్‌లోని లేబర్ అడ్డాల వద్దకు వెళ్లి అక్రమంగా మద్యం విక్రయిస్తున్నాడు. విషయం తెలుసుకున్న పోలీసులు కృష్ణప్రసాద్‌ని పట్టుకొని అతని వద్ద నుంచి 16 క్వార్టర్ బాటిళ్లను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అతివేగం ప్రమాదకరం

రాయికోడ్, సెప్టెంబర్ 10: ప్రతి వాహనదారుడు పరిమిత వేగంతోనే వెళ్లాలని ఎస్ఐ కృష్ణయ్య సూచించారు. ఎస్సీ, జహీరాబాద్ డీఎస్పీ ఆదేశాల మేరకు మండల పరిధిలోని నాగ్వార్ చౌరస్తా వద్ద మంగళవారం వాహనాలను తనిఖీ చేశారు. సరైన పత్రాలు లేని వారికి జరిమానాలు వేశారు. సిబ్బంది రాఘవేంద్ర, గౌస్ ఉన్నారు.

వీర వనిత చాకలి ఐలమ్మకు ఘన నివాళి

తెలంగాణ ఉద్యమకారిణి వీరవనిత చాకలి ఐలమ్మ వర్ధంతిని పురస్కరించుకొని మంగళవారం జిల్లా వ్యాప్తంగా ఆమె చిత్రపటాలు, విగ్రహాల వద్ద ఘన నివాళులర్పించారు. పలు పార్టీలు, కార్మిక, రజక, వృత్తి సంఘాల ఆధ్వర్యంలో చాకలి ఐలమ్మ పోరాట పటిమను స్మరించుకొని ఆమె అడుగుజాడల్లో నడుచుకోవాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో వీరవనితగా గుర్తింపు పొందిన ఐలమ్మ ప్రజా పోరాటాలకు స్ఫూర్తిగా నిలిచారన్నారు. తెలంగాణ భూపోరాటానికి నాంది పలికిన వీరమాత చాకలి ఐలమ్మ అని గుర్తు చేశారు.

- నమస్తే తెలంగాణ నెట్‌వర్క్, సెప్టెంబర్ 10



రామచంద్రాపురం: నివాళులర్పిస్తున్న కార్పొరేటర్ పుష్పానగేశ్

పటాన్‌చెరు: నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి, కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్

సంగారెడ్డి కలెక్టరేట్: నివాళులర్పిస్తున్న అదనపు కలెక్టర్ చంద్రశేఖర్

సంగారెడ్డి: ర్యాలీ నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు

న్యాల్‌కల్: హద్నూర్‌లో నివాళులర్పిస్తున్న నాయకులు

ఝరాసంగం: నివాళులర్పించిన నాయకులు

వట్‌పల్లి: నివాళులర్పిస్తున్న మండల నాయకులు

వరద ముంపునకు శాశ్వత పరిష్కారం

అదనపు కలెక్టర్ చంద్రశేఖర్

చిట్కుల్‌లో పర్యటిస్తున్న అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, ఇతర అధికారులు

పటాన్‌చెరు, సెప్టెంబర్ 10: మండలంలోని చిట్కుల్ గ్రామంలో వరదల కారణంగా ముంపునకు గురైన కాలనీలను మంగళవారం అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ పరిశీలించారు. గ్రామంలోని రాధమ్మ కాలనీ, నాగార్జున కాలనీల్లో ఇరిగేషన్, పంచాయతీరాజ్, ఇంజినీరింగ్ అధికారులతో కలసి పర్యటించారు. వరద కారణంగా వారం నుంచి కాలనీలు వరద నీటిలో మునిగాయి. వరద నీరు సజావుగా వెళ్లేలా చర్యలు తీసుకునేందుకు సంబంధిత శాఖల అధికారులతో చర్చించారు. ముత్తంగి పైనుంచి వస్తున్న వరద నీరు, చిట్కుల్‌లోని చెరువులకు వస్తున్న నీరు కొత్త కాలనీలు ఏర్పాటు కావడంతో జనావాసాల్లో నిలిచిపోయాయి. నీరు సాఫీగా నక్కవాగులోకి వెళ్లడం ఒకటే మార్గమని ఇంజినీరింగ్‌శాఖ అధికారులు తెలిపారు. దీనికి అదనపు కలెక్టర్ ఇరిగేషన్ శాఖ అధికారి చక్రవర్తితో మాట్లాడి నీరు నక్కవాగుకు వెళ్లేలా కాల్వలను పునరుద్ధరించాలని, కొత్త కాల్వలను నిర్మించాలని సూచించారు. దాదాపు రూ.కోటి 50లక్షల వరకు ఖర్చు వస్తుందని ఇంజినీరింగ్ అధికారులు తెలపడంతో రికార్డు చేసుకున్నారు. బాక్స్‌టైప్ డ్రైన్‌ను నిర్మిస్తే కాలనీలు ముంపునకు గురికావన్నారు. త్వరలో సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతామని హామీ ఇచ్చారు. వారం నుంచి రాకపోకలు నిలిచిపోయాయని, తాగునీరు, విద్యుత్ తదితర సమస్యలు ఉన్నాయని కాలనీవాసులు అధికారుల దృష్టికి తెచ్చారు. కార్యక్రమంలో డీఎల్‌పీవో అనిత, ఎంపీవో హరిశంకర్‌గౌడ్, మిషన్ భగీరథ డీఈ శ్రీనివాస్, కార్యదర్శి కవిత పాల్గొన్నారు.

విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి

మాట్లాడుతున్న న్యాయమూర్తి రమేశ్

సంగారెడ్డి, సెప్టెంబర్ 10: పాఠశాలల్లో విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని, చట్టాలపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి రమేశ్ సూచించారు. మంగళవారం పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నారుల బాగోగులపై శ్రద్ధ చూపిస్తూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. గృహ హింస, బాల్యవివాహ నిషేధ చట్టం, పోస్కో చట్టం, వరకట్న నిషేధ చట్టాలపై అవగాహన ఉండాలన్నారు. విద్యార్థులు బాగా చదివి ఉన్నత శిఖరాలను చేరుకోవాలని ఆకాంక్షించారు. విద్యార్థులకు న్యాయ సహాయం కోరితే జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

కొన్యాలను సందర్శించిన వైద్యాధికారులు

వివరాలు నమోదు చేసుకుంటున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో సునంద

హత్నూర, సెప్టెంబర్ 10: మండలంలోని కొన్యాల గ్రామాన్ని మంగళవారం వైద్యాధికారులు సందర్శించి బాధిత కుటుంబీకుల వద్ద వివరాలు సేకరించారు. గ్రామానికి చెందిన పసి బాలుడు డెంగ్యూతో మృతి చెందిన వార్త మంగళవారం పలు దినపత్రికల్లో రావడంతో డిప్యూటీ డీఎంహెచ్‌వో సునంద సిబ్బందితో కలిసి బాధిత కుటుంబీకులతో మాట్లాడారు. ప్రైవేటు దవాఖానలో బాలుడికి అందిన వైద్యం, ఫీజు వసూలుపై ఆరా తీశారు. పూర్తి విచారణ నివేదికను జిల్లా అధికారులకు అందించి తదుపరి చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో సీహెచ్‌వో పురుషోత్తం, ఎంపీహెచ్‌వో శ్రీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఫోస్టాఫీస్ ప్రారంభం

సదాశివపేట, సెప్టెంబర్ 10: పోస్టాఫీస్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని పోస్టాఫీస్ జిల్లా సూపరింటెండెంట్ మురళీకుమార్ సూచించారు. మంగళవారం మండల పరిధిలోని కంభాలపల్లిలో నూతనంగా మంజూరైన పోస్టాఫీస్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి నుంచి పోస్టాఫీస్‌కు ఇది బ్రాంచ్ ఆఫీసుగా ఉంటుందన్నారు. కంభాలపల్లి, రేజింతల్ గ్రామాల ప్రజలు వినియోగించుకోవాలన్నారు. పోస్టాఫీసు మంజూరుకు కృషి చేసిన తాజా మాజీ సర్పంచ్ శ్రీహరిని అభినందించారు. ఈ కార్యక్రమంలో రీజినల్ ఇన్‌స్పెక్టర్ సావిత్రి, ఐబీఎం వెంకటేశ్వర్లు, బీపీఎం అశోక్, రాజేందర్‌రెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో పాడి గేదెలు మృతి

న్యాల్‌కల్, సెప్టెంబర్ 10: విద్యుత్ అధికారుల నిర్లక్ష్యంతో కరెంట్ తీగలు తగిలి పాడి గేదెలు మృతి చెందిన ఘటన న్యాల్‌కల్ మండలంలోని మిర్జాపూర్(బి) గ్రామంలో మంగళవారం చోటుచేసుకుంది. గ్రామస్తుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన ఇస్మాయిల్ తన గేదెలను ఇంటి ముందు కట్టేశాడు. ఇంటి ముందు ఉన్న విద్యుత్ స్తంభానికి గల ఎల్‌టీ వైరు తెగి పేడ్డుపై నుంచి గేదెలపై పడిపోవడంతో షాక్‌కు గురై మృతిచెందాయి. గేదెలు కరెంట్ షాక్‌కు గురై కొట్టుకుంటున్న సమయంలో విద్యుత్ సిబ్బందికి ఫోన్ చేసి కరెంట్ సరఫరాను నిలిపివేయాలని కోరినా స్పందించలేదు. ఇరుగుపొరుగు వారు బైక్‌పై సబ్‌స్టేషన్‌కు వెళ్లి కరెంట్ సరఫరాను బంద్ చేయించారు. అప్పటికే పాడిగేదెలు రెండు మృతిచెందడంతో ఇస్మాయిల్ కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరయ్యారు. ఇనుప స్తంభానికి ఉన్న కరెంట్ వైర్లను సరిచేయాలని నాలుగు నెలలుగా అధికారులకు విన్నవించినా పట్టించుకోలేదని కాలనీవాసులు ఆరోపించారు. మృతిచెందిన పాడిగేదెల విలువ రూ.1.50 లక్షలు ఉంటుందని, బాధిత కుటుంబాన్ని ప్రభుత్వ పరంగా ఆదుకోవాలని కోరారు. ఘటనా స్థలానికి పశువైద్యాకారులు వచ్చి పోస్ట్‌మార్టం నిర్వహించారు. ట్రాన్స్‌కో మండల ఏఈ అర్జున్ పాడి గేదెలను పరిశీలించారు. ప్రభుత్వ పరంగా యాజమాని ఇస్మాయిల్‌ను ఆదుకుంటామని హామీ ఇచ్చారు.



ఎమ్మెల్యే మాణిక్‌రావుకు వినతిపత్రం ఇస్తున్న మాజీ సర్పంచ్ చిన్నారెడ్డి, నాయకులు

రోడ్డు మరమ్మతులు వెంటనే చేపట్టాలి

కోహీర్, సెప్టెంబర్ 10: జహీరాబాద్ మండలంలోని శేఖాపూర్ ప్రధాన రహదారికి వెంటనే మరమ్మతులు చేపట్టాలని ఆర్‌అండ్‌బీ అధికారులను ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు ఆదేశించారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు శేఖాపూర్ ప్రధాన రోడ్డు దెబ్బతిన్నదని, మరమ్మతులు చేయించాలని మాజీ సర్పంచ్ చిన్నారెడ్డి, తదితరులు మంగళవారం ఎమ్మెల్యే మాణిక్‌రావును కలిసి వినతిపత్రం ఇచ్చారు. ఈ మేరకు ఎమ్మెల్యే రోడ్డుకు మరమ్మతులు చేయాలని సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు.

ఉత్తమ ఉపాధ్యాయురాలిగా వినయపాటిల్

కోహీర్, సెప్టెంబర్10: జహీరాబాద్ మండలంలోని అల్గోల్ ప్రాథమిక పాఠశాలకు చెందిన వినయ పాటిల్‌కు ఉత్తమ ఉపాధ్యాయురాలిగా అవార్డు అందజేశారు. ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు మామిడి భీమ్‌రెడ్డి ఆధ్వర్యంలో నారాయణగూడ డిగ్రీ కళాశాలో సోమవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అవార్డును స్వీకరించారు. ప్రాథమిక విద్యాభివృద్ధికి కృషి చేస్తున్నందుకు ఆమె అవార్డును అందుకున్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఏవీఎన్‌రెడ్డి, విద్యాశాఖ కార్యదర్శి బుర్రా వెంకటేశం, 2024 సెమినా మిస్ ఇండియా సూర్యరేవతి, దేశ ప్రకాశ్‌రెడ్డి పాల్గొన్నారు.

క్వారీలను పరిశీలించిన అధికారులు

జిన్నారం, సెప్టెంబర్ 10: జిన్నారం మండలం రాళ్లకత్వ శివారులో నూతనంగా ఏర్పాటు చేస్తున్న కంకర క్రషర్, క్వారీలను మైనింగ్ అధికారులు మంగళవారం పరిశీలించారు. వీటి ఏర్పాటుతో నీటి వనరులు, వ్యవసాయ పొలాలు దెబ్బతింటున్నాయని గ్రామస్తులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు సంగారెడ్డి, నిజామాబాద్ మైనింగ్ అధికారి రఘుబాబు సిబ్బందితో కలిసి క్వారీ లక్ష్మీటై ఇచ్చిన స్థలాన్ని పరిశీలించారు. మొండికుంట, పొలాలను పరిశీలించారు. ఇప్పటికే ఉన్న క్వారీలతో నీటి వనరులు దెబ్బతింటున్నాయని, పొలాలు సాగు చేసుకోలేక పోతున్నామని రైతులు అధికారులకు తెలిపారు. రైతుల అభిప్రాయాలను నమోదు చేసుకున్న అధికారులు వాస్తవ పరిస్థితిని ఉన్నతాధికారులకు నివేదిస్తామని తెలిపారు. శివనగర్, రాళకత్వ, దాదిగూడెం గ్రామస్తులు పాల్గొన్నారు.

నమ్మించి కడతేర్చారు

హనుమాన్ దాస్ (ఫైల్)

పుల్కల్, సెప్టెంబర్ 10: స్నేహం ముసుగులో నమ్మించి కడతేర్చిన ఘటన మంగళవారం మండలంలోని ముదిమాణిక్యం తండాలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన కథనం ప్రకారం.. ముదిమాణిక్యం తండాకు చెందిన హనుమాన్ దాస్(24)తో సోమవారం సాయంత్రం ఆరు గంటల సమయంలో గ్రామానికి చెందిన ముగ్గురు స్నేహితులు అనిల్, దుర్గాప్రసాద్, పత్తు కలిసి పుల్కల్‌లోని వైన్స్‌కు వెళ్లారు. అక్కడ మాటమాట పెరిగి హనుమాన్ దాస్‌పై పదునైన ఆయుధంతో దాడి చేసి హతమార్చి పరారయ్యారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు హత్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పరారీలో ఉన్న ముగ్గురి కోసం పోలీసులు మూడు బృందాలుగా ఏర్పడి గాలిస్తున్నట్లు ఎస్ఐ పాటిల్ క్రాంతికుమార్ తెలిపారు.

బోర్పట్ల ఎపిటోరియా పరిశ్రమ ఎదుట ఆందోళన చేస్తున్న బోర్పట్ల గ్రామస్తులు

కాలుష్యం మాకు.. ఉపాధి వాళ్లకా?

ఎపిటోరియా ఫార్మా పరిశ్రమ ఎదుట బోర్పట్ల గ్రామస్తుల ఆందోళన

హత్నూర, సెప్టెంబర్ 10: రసాయన పరిశ్రమ విడుదల చేస్తున్న కాలుష్యంతో అనారోగ్యం పాలవుతున్న తమపై వివక్ష చూపుతూ స్థానికేతరులకు ఉద్యోగాలు కల్పిస్తున్న పరిశ్రమ యాజమాన్యం తీరుపై స్థానికులు మంగళవారం నిరసన చేపట్టారు. హత్నూర మండలం బోర్పట్ల శివారులోని ఎపిటోరియా ఫార్మా యూనిట్-1 పరిశ్రమ యాజమాన్యం స్థానికులకు ఉద్యోగావకాశాలు కల్పించకపోవడంతోపాటు పరిశ్రమలో పని చేస్తున్న కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించడంలేదని ఆరోపించారు. ఏండ్లుగా పరిశ్రమలో కాంట్రాక్టు కార్మికులుగా విధులు నిర్వహిస్తున్నా ఉద్యోగులుగా గుర్తించడంలేదన్నారు. పరిశ్రమ విడుదలచేసే కాలుష్యంతో రోగాలబారిన పడుతున్న తమపై వివక్ష చూపడం ఏంటని ప్రశ్నించారు. ఇప్పటికైనా పరిశ్రమ యాజమాన్యం దిగివచ్చి అర్హతగల కార్మికులను ఉద్యోగులుగా గుర్తించడంతోపాటు స్థానికులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. నిరసనకు పలు సంఘాలు మద్దతు తెలిపాయి. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటుచేశారు.

స్థానికులకే ఉద్యోగాలివ్వాలి

ఎపిటోరియా పరిశ్రమ యాజమాన్యం స్థానికేతరులకు ఉద్యోగాలు కల్పిస్తున్నది. అర్హతగల స్థానిక కార్మికులను ఉద్యోగులుగా గుర్తించడంలో నిర్లక్ష్యం చేస్తున్నది. ఏండ్లుగా పరిశ్రమలో పని చేస్తున్నా కాంట్రాక్టు కార్మికులుగానే చూస్తున్నది. స్థానికులను న్యాయం జరిగేవరకు పోరాటం కొనసాగిస్తాం.

- కమలాకర్, బోర్పట్ల

ఇబ్బందులు పడుతున్నాం

ఎపిటోరియా పరిశ్రమ విడుదల చేస్తున్న జల, వాయు కాలుష్యంతో నిత్యం ఇబ్బందులు పడుతున్నాం. స్థానికులకు కాలుష్యం తప్ప ఉద్యోగాలు రావడం లేదు. యాజమాన్యం స్థానికులకు ఉద్యోగాలు కల్పించడంతోపాటు అర్హులైన స్థానిక కార్మికులను పరిశ్రమ ఉద్యోగులుగా గుర్తించాలి.

- మల్లేశం, బోర్పట్ల

నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

ఝరాసంగం, సెప్టెంబర్ 10: నిబంధనలకు విరుద్ధంగా వెంచర్లు అభివృద్ధి చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని డీఎల్‌పీవో అమృత హెచ్చరించారు. మంగళవారం మండల పరిధిలోని ఎల్గోయి, కుప్సానగర్ గ్రామాలను సందర్శించి పలు వెంచర్లను పరిశీలించారు. ఎంపీడీవో సుధాకర్, ఇన్‌చార్జి ఎంపీవో రాములు, పంచాయతీ కార్యదర్శులు నర్సింహులు, స్వప్న ఉన్నారు.

వెంచర్‌ను పరిశీలిస్తున్న డీఎల్‌పీవో అమృత

ముదిమాణిక్యం చెరువుకు గండి

ముదిమాణిక్యం చెరువుకు పడిన గండి

పుల్కల్, సెప్టెంబర్ 10: మండలంలోని ముదిమాణిక్యం చెరువుకు మంగళవారం గండి పడడంతో నీళ్లనన్నీ చెరువు కిందిపొలాల్లోకి వెళ్లడంతో సుమారు పది ఎకరాల పంట నష్టం వాటిల్లిందని రైతులు వాపోయారు. ఆరేండ్ల క్రితం వచ్చిన అకాల వర్షాలకు చెరువు కట్టకు మరమ్మతులు చేపట్టడంతో గండి పడలేదని పీఏసీఎస్ మాజీ చైర్మన్ రమేశ్ అన్నారు. కొద్ది రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు గండి పడి పూర్తిగా తెగిపోయిందని తెలిపారు. చెరువు విస్తీర్ణం 80 ఎకరాలు ఉందని, త్వరలోనే మరమ్మతులు చేపడుతామని ఏఈ మహేశ్ చెప్పారు.

సీసీ రోడ్డుకు శంకుస్థాపన

సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేసిన చైర్‌పర్సన్ రోజాబాల్‌రెడ్డి

బొల్లారం, సెప్టెంబర్ 10: మున్సిపాలిటీ పరిధిలోని 6వ వార్డులో రూ.30లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్డు పనులకు మంగళవారం మున్సిపల్ చైర్‌పర్సన్ రోజాబాల్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. మున్సిపాలిటీని అన్నివిధాలుగా అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్ సుజాతామహేందర్‌రెడ్డి, మేనేజర్ నిర్మలారెడ్డి, ఏఈ కిష్టయ్య, కాంట్రాక్టర్ ప్రశాంత్ పాల్గొన్నారు.

పుష్పగుచ్ఛం ఇస్తున్న నాయకులు

పీసీసీ అధ్యక్షుడిని కలిసిన నాయకులు

అమీన్‌పూర్ సెప్టెంబర్ 10: పీసీసీ అధ్యక్షుడిగా నియమితులైన బొమ్మ మహేశ్‌కుమార్ గౌడ్‌ను నియోజకవర్గ నాయకుడు కాట శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో పార్టీ అమీన్‌పూర్ అధ్యక్షుడు శశిధర్ రెడ్డితో పాటు నాయకులు, కార్యకర్తలు హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. శాలువా, పుష్పగుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు మున్నా, కొలూర్లు మల్లేశ్‌ముదిరాజ్, సదువు మల్లేశ్‌ముదిరాజ్, యూసుఫ్ అలీ, కాంగ్రెస్ జిల్లా చేనేత విభాగం అధ్యక్షుడు ప్రవీణ్ నేత, భ్రమరాంబిక మల్లికార్జున దేవస్థానం ఆలయ చైర్మన్ బైన సుధాకర్ యాదవ్ పాల్గొన్నారు.

శాంతియుతంగా ఉత్సవాలు నిర్వహించాలి

నారాయణఖేడ్, సెప్టెంబర్ 10: గణేశ్ ఉత్సవాలను శాంతియుతంగా నిర్వహించాలని డీఎస్పీ వెంకట్‌రెడ్డి సూచించారు. మంగళవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో నారాయణఖేడ్, నిజాంపేట్ మండలాల్లోని గణేశ్ ఉత్సవ నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. మండపాల వద్ద వలంటీర్లు బ్యాడ్జీలు ధరించి భద్రతతోపాటు అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా చూడాలన్నారు. అగ్నిప్రమాదాలు జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. నిమజ్జనాలకు డీజే అనుమతి లేదని, రెండు సౌండ్‌బాక్స్‌లు మాత్రమే ఏర్పాటు చేసుకోవాలన్నారు. నిమజ్జనాన్ని త్వరగా ప్రారంభించి రాత్రి 12 గంటలలోపు పూర్తి చేయాలన్నారు. ఏవైనా సమస్యలుంటే తమ దృష్టికి తేవాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జగ్జీవన్, సీఐ శ్రీనివాస్‌రెడ్డి, ఎస్ఐ విద్యాచరణ్‌రెడ్డి ఉన్నారు.

ఆత్మహత్య సమస్యలకు పరిష్కారం కాదు

సంగారెడ్డి కలెక్టరేట్, సెప్టెంబర్ 10: యువత ఆత్మహత్యలు చేసుకోవడం సరికాదని తారా ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కేఎస్ఎస్ రత్నప్రసాద్ పేర్కొన్నారు. మంగళవారం తారా కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగాలు, జీవ శాస్త్రం విభాగం సంయుక్త ఆధ్వర్యంలో అంతర్జాతీయ ఆత్మహత్యల నిరోధక దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ అనేక కారణాలు, సామాజిక మాధ్యమాలచే నేటి యువత ఒత్తిడికిలోనై అనసవరంగా ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రతి సమస్యకు ఒక పరిష్కారం ఉంటుందనే విషయాన్ని గ్రహించాలన్నారు. విద్యార్థులు క్షణికావేశానికి లోనుకాకుడదని సూచించారు. అనంతరం విద్యార్థులచే ప్రాణాయామం చేయించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ జగదీశ్వర్, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ మల్లిక పాల్గొన్నారు.

ఇంటర్న్‌షిప్‌పై విద్యార్థులకు అవగాహన

ఆర్ఎస్ఎల్ టెక్నాలజీ సహకారంతో కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగాలు, జీవ శాస్త్రం విభాగం సంయుక్త ఆధ్వర్యంలో ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, ఇంటర్న్‌షిప్‌పై విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని మంగళవారం తారా కళాశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ కేఎస్ఎస్ రత్నప్రసాద్ మాట్లాడుతూ సాంకేతికత ద్వారానే నైపుణ్యాల అభివృద్ధి జరుగుతుందన్నారు. ఆధునిక కాలంలో ఇన్